క్లుప్తంగా

ఈ నెల 9న మహిళా దినోత్సవ వేడుకలు

చిక్కడపల్లి: జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మార్చి 9న త్యాగరాయగానసభలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు గుడిబండి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. వివిధ రంగాల మహిళలకు ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి, మేడ్చల్ అదనపు కలెక్టర్ నరసింహారెడ్డి నవరత్న పురస్కారాలను బహూకరిస్తారని సమాచారం.

ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో పనిచేయాలి



మహ్మద్‌గౌస్‌ను సన్మానిస్తున్న ముషీరాబాద్ సీఐ జహంగీర్‌యాదవ్

ముషీరాబాద్: ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో పనిచేయాలని ముషీరాబాద్ సీఐ జహంగీర్‌యాదవ్ సూచించారు. మంగళవారం ముషీరాబాద్‌కు చెందిన ప్రముఖ సంఘ సేవకుడు మహ్మద్‌గౌస్ ప్రజా సమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషిని అభినందిస్తూ.. బాపూజీ నగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి సీఐ ముఖ్య అతిథిగా హాజరై గౌస్‌ను సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ గౌస్ తండ్రి బాబులాల్ సైతం మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నారన్నారు. ముషీరాబాద్ ఎస్సైలు సురేందర్, ప్రసాద్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు శివ ముదిరాజ్, మోహన్, రాజు, వైఎస్‌ఆర్టీపీ ముషీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బెరీనా తదితరులు పాల్గొన్నారు.

త్యాగరాజ స్వామి కీర్తనలతో అలరించిన సంగీత విద్యార్థులు



నల్లకుంట: శ్రీరామ గానసభ ఆధ్వర్యంలో న్యూ నల్లకుంటలోని సీతారామాంజనేయ సరస్వతి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న త్యాగరాజస్వామి వార్షిక ఆరాధనోత్సవాల్లో కళాకారులు ఆలపిస్తున్న కీర్తనలు ఆకట్టుకున్నాయి. మంగళవారం సాయంత్రం కీర్తన సంగీత విద్యాసంస్థ విద్యార్థులు, ఎంపీ కమలారమణిల గానం ఆహుతులను అలరించింది. దీనికి కేఎల్‌ఎన్ మూర్తి, కోలంక సాయికుమార్ వయోలిన్‌పై పీఎస్.మల్లికార్జున్, శ్రీనివాస్ గోపాలన్ మృదంగంపై వాయిద్య సహకారం అందించారు. చివరగా గాయనీగాయకులను శ్రీరామగానసభ కార్యదర్శి సాయి శ్రీనివాసశర్మ శాలువాతో సన్మానించారు.

విద్యార్థుల సృజనాత్మకతను ప్రోత్సహించాలి



సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు కిశోర్‌గౌడ్

అంబర్‌పేట: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను పాఠశాల దశలోనే వెలికితీయాలని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు కిశోర్‌గౌడ్ ఆకాంక్షించారు. మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా బాగ్‌అంబర్‌పేటలోని నారాయణ ఈ టెక్నో స్కూల్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. విద్యార్థులు రూపొందించిన వివిధ అంశాలను ఆయన పరిశీలించి అభినందించారు. విద్యార్థి దశలో వారి ఆలోచనలకు తగిన స్వేచ్ఛ కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అతిథులుగా ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ వెంకటదీప్తి హాజరు కాగా.. ప్రిన్సిపాల్ మౌని స్టాలిన్, ఏఓ మల్లికార్జున్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'పార్లమెంట్ భవనానికి అంబేడ్కర్ పేరు పెట్టాలి'

లిబర్టీ: నూతన పార్లమెంట్ భవనానికి అంబేడ్కర్ పేరు పెట్టాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముడి మార్టిన్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దళితుల అభ్యున్నతి, సంక్షేమం కోసం పాటుపడుతున్నామని చెబుతున్న కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ భవనానికి అంబేడ్కర్‌పై పేరు పెట్టి నిబద్ధత నిరూపించుకోవాలన్నారు. దళితుల అభ్యున్నతి, ఆర్థికాభివృద్ధి కోసం పనిచేసి అంబేడ్కర్ చరిత్రలో నిలిచిపోయారని చెప్పారు.

చెట్ల సంరక్షణకు పటిష్టమైన చర్యలు

ఇందిరాపార్కును సందర్శించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్



కవాడిగూడ: ఇందిరాపార్కులోని చెట్ల సంరక్షణ కోసం పటిష్టమైన చర్యలు చేపడతామని ఈ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గంధపు చెట్ల నరికివేతకు గురైన విషయం తెలియడంతో ఆయన బీఆర్‌ఎస్ నాయకులు, అధికారులతో కలిసి పార్కును సందర్శించి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఇందిరా పార్కులో వరుసగా గంధపు చెట్లను దొంగలు నరికి వేయడం దురదృష్టకరమని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

- ఇందిరాపార్కు చెట్ల సంరక్షణకు అదనంగా సెక్యూరిటీ గార్డులను పెంచే ప్రయత్నం చేస్తామన్నారు. పార్కులో ఇప్పటికే 365 గంధపు చెట్లు ఉన్నాయని వీటిలో రెండేళ్ల క్రితం 13 చెట్లను తాజాగా శనివారం 10 చెట్లను దుండగులు నరికి వేశారన్నారు.
- పోలీస్ అధికారులు దీనికి బాధ్యులైన వారిని పట్టుకునేలా తగిన చర్యలు తీసుకోవాలని వారిని కోరారు. అధికారులు శ్రీదేవి, భాస్కర్, మౌనిక, బీఆర్‌ఎస్ యువజన రాష్ట్ర నాయకులు ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్యామ్‌యాదవ్, సాయికృష్ణ, హనుమాన్ ఆలయ చైర్మన్ రాజశేఖర్‌గౌడ్, ప్రభాకర్, శ్యామల, మధు, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

ముషీరాబాద్: అభివృద్ధి పనుల్లో జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు సమన్వయంతో పనిచేయాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ముషీరాబాద్ డివిజన్‌లోని పార్శిగుట్టలో రోడ్డు పనులను పరిశీలించేందుకు మంగళవారం ఆయన జీహెచ్‌ఎంసీ డీఈ గీతాకుమారి, జలమండలి డీజీఎం మోహన్‌రాజ్, సెక్షన్ మేనేజర్ నవీన్‌లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పార్శిగుట్ట చౌరస్తా నుంచి ప్రేయర్ పవర్ చర్చి వరకు డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉండటంతో ముందుగా డ్రైనేజీ పైపులైన్ వేసిన అనంతరం సీసీ రోడ్డు వేస్తామన్నారు. దీనికి జలమండలి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ పనులు పూర్తయిన వెంటనే రాంనగర్ బాలాజీ చౌరస్తా నుంచి స్వీట్ షాపు వరకు పైపులైన్ వేసి మిగిలిన పనులను పూర్తి చేస్తామన్నారు. ఇరు శాఖల అధికారులు సమన్వయంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పనిచేయాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

కంటి సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

కాచిగూడ: విద్యార్థులకు కంటి సంబంధిత సమస్యలు ఉండటం వల్లే చదువులో వెనుకబడుతున్నారని కంటిని నిర్లక్ష్యం చేయవద్దని బద్రుక విద్యాసంస్థల కార్యదర్శి శ్రీకిషన్ బద్రుక అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు సరైన అవగాహన లేకపోవడం వల్లే వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాచిగూడలోని బద్రుక కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ ఆర్ట్స్, బద్రుకా హెల్త్ సెంటర్, ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్య కేంద్రం సహకారంతో కళాశాల ఆడిటోరియంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ప్రస్తుతం చాలా మందికి చిన్నప్పటి నుంచే కంటి సమస్యలు ఉన్నాయన్నారు. ఈ సమస్యను కొంత వరకు నివారించాలనే ఉద్దేశంతో బద్రుకా కళాశాలలో కంటి వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. హెల్త్ సెంటర్ డాక్టర్ పూర్ణచంద్రమూర్తి, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు, డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ అభిరామకృష్ణ, ప్రిన్సిపల్ మోహన్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్స్ డా.ఎం.జానకిరామ్, డా.పి.వెంకటయ్య, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు ఈవీసీఎం శాస్త్రీ, డా.కె.మమత, ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ డాక్టర్ అపూర్వశర్మ, డాక్టర్ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. దాదాపు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.



బద్రుక కళాశాలలో కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఘనంగా టైలర్స్ డే



టైలర్స్‌డేలో ఏసీపీ వెంకటరమణ తదితరులు

అంబర్‌పేట: అంతర్జాతీయ టైలర్స్ డే వేడుకలు గోల్నాకలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం ప్రముఖ సంఘ సేవకులు, టైలర్ రచ్చ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గోల్నాకలోని ఆయన టైలర్‌షాపులో నిర్వహించారు. ఈ వేడుకలకు ఏసీపీ వెంకటరమణ, ప్రముఖ హైకోర్టు న్యాయవాది జీఎల్.నరసింహారావు తదితరులు హాజరై కేక్‌కట్ చేసి పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు టైలర్లకు శుభాకాంక్షలు తెలిపారు. టైలర్లు రాజేందర్, విజయ్‌కుమార్, శ్రీనివాస్, ప్రభాకర్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో పార్కుల పచ్చదనానికి కృషి

అంబర్‌పేట: వేసవిలో పార్కుల పచ్చదనానికి ప్రత్యేక కృషి చేస్తానని బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి తెలిపారు. మంగళవారం బతుకమ్మకుంట వాంబే కాలనీలో వేసవి నీటిఎద్దడి నివారణకు వేయిస్తున్న బోరు పనులను కార్పొరేటర్ పర్యవేక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పార్కులకు నీటి అవసరాలను సమకూర్చేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటామన్నారు. స్థానికులకు నీటి అవసరాలను తీర్చేందుకు కృషి చేస్తున్నామని వివరించారు.



ప్రజల సౌకర్యం కోసమే 40 నంబరు బస్సు పునరుద్ధరణ

పాతరూట్ అశోక్‌నగర్ మీదుగా తిరిగి ప్రారంభమైన ఆర్టీసీ



కండక్టర్ వద్ద టిక్కెట్ తీసుకుంటున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి: ప్రయాణికుల సౌకర్యార్థం 40 నంబరు ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించడం జరిగిందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. అశోక్‌నగర్ మీదుగా వెళ్లే 40 నంబరు ఆర్టీసీ సర్వీసును మంగళవారం అశోక్‌నగర్ చౌరస్తా వద్ద ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

- ఈ బస్సును దారి మళ్లించడంతో అశోక్‌నగర్, చుట్టు ప్రక్కల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని స్థానిక ప్రజలు తమ దృష్టికి తీసుకురావడంతో ఆర్టీసీ, ట్రాఫిక్ ఉన్నతాధికారులతో చర్చించి సమస్యను పరిష్కరించామన్నారు.
- 45ఎఫ్ బస్సు సర్వీసును కూడా పునరుద్ధరించడం జరిగిందన్నారు. ఈ సర్వీస్‌ను తిరిగి ప్రారంభించడంతో పేద, మధ్యతరగతి ప్రజలు, విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు.
- బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకులు ముఠా జైసింహ, ముషీరాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ కిషన్‌రావు, కళ్యాణి, బీఆర్‌ఎస్‌కేవీ యూనియన్ నాయకుడు సీసా నరసింహగౌడ్, కంట్రోలర్ జైపాల్‌రెడ్డి, కో– ఆర్డినేటర్ ఎస్.చారి, బీఆర్‌ఎస్ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు రాకేష్‌కుమార్, ముఠా నరేష్, ప్రభాకర్, ఎర్రం శ్రీనివాస్ గుప్తా, సత్యనారాయణ, జీవై గిరి, కిరణ్, జహంగీర్, విఠల్, పద్మ, లక్ష్మి, ఆనంద్, భాస్కర్‌రెడ్డి, ఎండీ గౌస్, చందు తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల బెడదకు ప్రత్యేక చర్యలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

అంబర్‌పేట: వీధి కుక్కల బెడదను తీర్చేందుకు జీహెచ్‌ఎంసీ ప్రత్యేక కార్యాచరణ తీసుకుందని అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ అన్నారు. వీధికుక్కల పట్ల చిన్నారులు జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. మంగళవారం అంబర్‌పేట సీపీఎల్ ప్రభుత్వ పాఠశాలలో జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వీధి కుక్కలకు చిన్నారులు దూరంగా ఉండాలని వాటితో చిలిపిచేష్టలు చేయవద్దని సూచించారు. కుక్కలు కరిచిన వెంటనే సబ్బు నీళ్లతో కడిగి తక్షణమే వైద్యుడిని సంప్రదించాలన్నారు. డీఎంసీ వేణుగోపాల్, జీహెచ్‌ఎంసీ వెటర్నరీ విభాగం సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే పాదయాత్ర



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ బర్కత్‌పురాలో వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, సిబ్బందితో కలిసి పాదయాత్ర చేశారు. మంగళవారం ఆర్టీసీ కాలనీలో స్థానిక ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. పారిశుద్ధ్యం, వీధి దీపాలు, ఇష్టానుసారంగా తిరిగే భారీ వాహనాలు తదితర సమస్యలను పరిష్కరించాలని స్థానికులు ఆయనను కోరారు. చెత్త, మట్టికుప్పలను తొలగించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. భారీ వాహనాలు తిరగకుండా బారికేడ్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అసాంఘిక కార్యక్రమాలపై నిఘా ఉంచేలా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు, బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముతున్న కేంద్రం'

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముతుందని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.వీరయ్య విమర్శించారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్, వివిధ రంగాలపై ప్రభావం' అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'దేశ సంపదనంతా ధనవంతులకు కట్టబెడుతూ.. దివాలా తీయిస్తున్నారని' విమర్శించారు. దివ్యాంగుల సంక్షేమం పట్ల పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ధరలు పెరుగుతున్నా వాటిని అరికట్టడం లేదని ప్రజల కొనుగోలు శక్తిని పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రజలకు ప్రశ్నించే హక్కు లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్నాయని మండిపడ్డారు. విద్య, వైద్యాన్ని ఉచితంగా ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్, కోశాధికారి ఆర్.వెంకటేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.రాజు, దశరథ్, సహ కార్యదర్శి ఉపేందర్, రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రకాష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌పీఆర్‌డీ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.వీరయ్య

ఆలయం వద్ద పెరుకుపోయిన వ్యర్థాల తొలగింపు



చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ సిద్ధం శెట్టి టవర్స్ బంగారు పోచమ్మ దేవాలయం పక్కన పేరుకుపోయిన చెత్త కుప్పలను మంగళవారం జీహెచ్‌ఎంసీ సిబ్బంది తొలగించారు. చాలా రోజులుగా వ్యర్థాలు పేరుకుపోవడంతో పలువురు అపార్ట్‌మెంట్‌వాసులు స్థానిక కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆమె మున్సిపల్ శానిటేషన్ సిబ్బందిని ఆదేశించి వ్యర్థాలను తొలగింపజేశారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నవీన్ కుమార్ ఉన్నారు.

దేవాలయాల్లో కళాక్షేత్రాలను నిర్మించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో కళాక్షేత్రాలను నిర్మించాలని అన్నమయ్య కళాక్షేత్ర పీఠాధిపతి విజయ శంకరస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం అన్నమయ్య కళాక్షేత్రం పీఠం ఆధ్వర్యంలో కోవిద సహృదయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డా.అనూహ్యారెడ్డి సహకారంతో చినుకు కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి పీ.ఎస్.మూర్తి అధ్యక్షతన సంగీత, నృత్య గురువుల సమ్మేళనం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న అన్నమయ్య కళాక్షేత్ర పీఠాధిపతి విజయశంకర స్వామి మాట్లాడుతూ.. దేవాలయాల్లో సంప్రదాయ నృత్యకారుల వేదికను ఏర్పాటు చేసి ప్రదర్శనలు ఇచ్చిన కళాకారులకు దారి ఖర్చులతో పాటు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం గురువులకు జ్ఞాపికలను అందజేసి ఘనంగా సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ జానపద వృత్తి కళాకారుల సంఘం అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు, తెలంగాణ జాపది వృత్తి కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ అనూహ్యారెడ్డి

'రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను పాల్పడుతోంది'



ప్రజాగోస, బీజేపీ భరోసా కార్యక్రమంలో కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ నేతలు

చిక్కడపల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. మంగళవారం గాంధీనగర్ డివిజన్‌లోని వాల్మీకినగర్ బస్తీలో ఈ కేంద్రం ఇన్‌చార్జ్ వీఎస్టీ రాజు, బూత్ అధ్యక్షులు సాయిసంతోష్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రజాగోస, బీజేపీ భరోసా కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ పరిపాలనలో ప్రతి సామాజిక వర్గం ప్రజలు సంతోషంగా తమ జీవన విధానాన్ని సాగించే రోజు చేరువలోనే ఉందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ నగర యువ నాయకులు ఎ.వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షులు రత్నసాయిచంద్, సూర్యారావు, సంయుక్త, సాయికుమార్, సాయితరుణం, నీరజ్, రఘుయాదవ్, శ్రీకాంత్, భరత్, యాదగిరి, నరసింహ, సురేష్, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ లారీ బ్రేక్ ఫెయిల్.. తప్పిన ప్రమాదం

అంబర్‌పేట్: అంబర్‌పేట్ అలీ కేఫ్ చౌరస్తాలో ఓ టిప్పర్ లారీ బీభత్సం సృష్టించింది. మంగళవారం రాత్రి ఏపీ07టీజే1656 నంబరు గల టిప్పర్ లారీ బ్రేక్ ఫెయిల్ అయ్యి రెండు కార్లను ఢీ కొట్టగా.. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే భాస్కర్‌రావు క్షమాపణ చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్.వీ.చెన్నారావు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చాకలి, మంగలి కులాలను అవమానపరిచేలా మాట్లాడిన మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు బహిరంగ క్షమాపణ చెప్పాలని వాయిద్య కళాకారుల జాతీయ అధ్యక్షుడు చెన్నారావు డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిర్యాలగూడ నియోజకవర్గంలో దళితబంధు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఓ మహిళా ఎంపీపీ తనను పేరు పెట్టి వేదిక పైకి పిలవలేదని ఎమ్మెల్యేను నిలదీయగా అసహనంతో 'కుల దుహంకారంతో చాకలి, మంగలి పని నేనే చేయాలా' అని ఉచ్చరించడం సిగ్గు చేటన్నారు. బాధ్యత గల పదవిలో ఉండి ఇతర కులాలను కించపరిచేలా వ్యవహరించడంపై వారు ప్రశ్నించారు. ఎస్సీ, బీసీ కులాలను అవమానపరిచిన ఎమ్మెల్యే భాస్కర్‌రావు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి అధ్యక్షుడు దుర్గారావు, నాయకులు శ్రీకాంత్, కీర్తియుగేందర్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుల భారీ ర్యాలీ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనంతో పాటు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. 'గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్' ఆధ్వర్యంలో మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఆర్టీసీ క్రాస్‌రోడ్డు మీదుగా ఇందిరాపార్కు వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ.. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించేంత వరకు పోరాటం చేస్తామని పేర్కొన్నారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి పాలడుగు భాస్కర్, సీఐటీయూ నాయకులు వెంకటేష్, ఎస్.రమా, సాయిబాబు, గోపాల్, జయలక్ష్మి, రాజారావు తదితరులు ఉన్నారు.



భారీ ప్రదర్శన నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

లాభాల పేరుతో లూటీ

హిమాయత్‌నగర్: లాభాల పేరుతో నగరవాసికి సైబర్ నేరగాళ్లు టోకరా వేశారు. తొలి రోజుల్లో లాభాలు చూపిన నేరగాళ్లు నమ్మకం కలిగించి లూటీ చేశారు. వెంగళరావునగర్‌కు చెందిన ఓ వ్యక్తికి కొద్ది రోజుల క్రితం టెలిగ్రామ్ ద్వారా ఒకడు పరిచయమయ్యాడు. తాను ఇన్వెస్టర్‌ని అంటూ తక్కువ సమయంలో లక్షలు సంపాదిస్తున్నట్లు చెప్పాడు. బాధితుడికి ఓ లింక్ పంపించి రిజిస్టర్ చేసుకోమని చెప్పగా అతడు చెప్పినట్లు చేశాడు. ఆ తర్వాత రెండు, మూడు పర్యాయాలు చిన్న మొత్తానికి రెండింతలు లాభాలు ఇచ్చారు. ఆపై లెవెల్స్ రీచ్ కావాలంటూ పలు దఫాలుగా రూ.6లక్షల 88 వేలు కాజేశారు. దీంతో బాధితుడు మంగళవారం సిటీ సైబర్ క్రైం ఏసీపీ కేవీఎం ప్రసాద్‌కు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

లయన్స్ క్లబ్ వ్యక్తిగత అవార్డుల ప్రదానం



అవార్డులతో లయన్స్ క్లబ్ సభ్యులు

చిక్కడపల్లి: నవభారత్ లయన్స్ క్లబ్ 4 వ్యక్తిగత అవార్డులను క్లబ్‌కు 6 అవార్డులు అందుకుందని క్లబ్ సీనియర్ సభ్యురాలు, కౌన్సిలింగ్ సైకోథెరపిస్ట్, హిప్నోథెరపిస్ట్ హిప్నో పద్మాకమలాకర్ అన్నారు. లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ యాదయ్యగౌడ్ నగరంలో జరిగిన క్లబ్ ప్రాంతీయ సమావేశంలో ఈ అవార్డులను అందజేశారు. మంగళవారం అశోక్‌నగర్‌లోని 'మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్'లో ఆమె మాట్లాడుతూ.. పేదలు, అణగారిన వర్గాలకు సేవలందించిన సభ్యులకు గుర్తింపుగా గోపాలకృష్ణ, పద్మాకమలాకర్, వినయ్‌లతో పాటు పలు సేవలకు క్లబ్‌కు ఈ అవార్డులు వచ్చాయన్నారు. విద్యాసాగర్, సత్యనారాయణ, మహేంద్ర, హర్ష పాల్గొన్నారు.